క్లుప్తంగా

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ



ఉద్యోగుల నూతన కమిటీని అభినందిస్తున్న ఏపీ ఎన్జీవోస్ నాయకులు

ఏలూరు(మెట్రో) : ఉద్యోగుల సమస్యలపై ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నిరంతరం పోరాడుతుందని జిల్లా ఎన్జీవో అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీని స్థానిక కస్తూరి వారి వీధిలో సంఘ భవనంలో నిర్వహించారు. నూతన చైర్మన్గా యాసలపు శ్రీను, కార్యదర్శిగా సాదిమెళ్ల శివలతో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎన్జీవో కార్యదర్శి నెరుసు వెంకట రామారావు వ్యవహరించారు. ఎన్జీవో అసోసియేషన్ తరుపున నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

నాలుగో తరగతి ఉద్యోగులకు అమరావతి జేఏసీ అండ



హెడ్ హక్ కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ రమేష్కుమార్

ఏలూరు (మెట్రో) : నాలుగో తరగతి ఉద్యోగులకు ఏపీ జేఏసీ అమరావతి అండగా ఉంటుందని జేఏసీ రాష్ట్ర చైర్మన్ కె.రమేష్ కుమార్ అన్నారు. ఏలూరు రెవెన్యూ కార్యాలయం భవనంలో ఆదివారం ఆల్ ఏపీ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా హెడ్హక్ కమిటీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమేష్కుమార్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ప్రతి ఒక్కరూ ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో జిల్లా హెడ్ హక్ కమిటీ అధ్యక్షులుగా వీరవల్లి వీరాస్వామి, కార్యదర్శిగా పి.ఆకాష్లతో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

పెదపాడు: అక్రమంగా కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పెదపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం పెదపాడు గ్రామం వైపునకు కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పెదపాడు ఎస్సై తన సిబ్బందితో కలిసి అడ్డుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ చల్లా తెలిపారు.

వలంటీర్లు.. నిజమైన సేవకులు

వలంటీర్లకు వందనం

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ కొనసాగాలని ప్రజలు కోరుతున్నారు. వలంటీర్లపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పథకాలు, ప్రజాధనాన్ని దోచుకున్న టీడీపీ నాయకులు, జనసేన ప్రతినిధులు వలంటీర్లపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని హెచ్చరిస్తున్నారు. నీతి, నిజాయితీగా పని చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందించిన వలంటీర్ల వ్యవస్థ కొనసాగాలని కోరుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేసి పేదలకు సంక్షేమ పథకాలు మంజూరు చేయించారని కొనియాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు అవినీతికి పాల్పడి పథకాలు మంజూరు చేయిస్తే, నేటి ప్రభుత్వ హయాంలో ఒక్కపైసా కూడా తీసుకోకుండా వలంటీర్లు పథకాలు అందిస్తున్నారని అన్నారు. ప్రతి నెలా 1వ తేదీన పింఛన్ అందాలంటే వలంటీర్లు కొనసాగాలంటున్నారు. పార్టీ, కుల, మత, వర్గ భేదాలు లేకుండా అర్హత కలిగిన వారికి నిరంతరం పథకాలు కొనసాగేందుకు వలంటీర్లు సేవలు ఉండాలన్నారు. కరోనా కష్టకాలంలో వైద్య పరీక్షలు చేయించారని, క్వారంటైన్ సమయంలో నిత్యావసర సరుకులు అందించి ఆపద్బాంధవులయ్యారని గుర్తు చేస్తున్నారు.



శనివారపుపేటలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

పవన్ కళ్యాణ్ నిజం తెలుసుకుని మాట్లాడాలి



వలంటీర్లు అమ్మాయిలను వేధిస్తున్నారంటూ జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలు సరైనవి కావు. ఒక వ్యక్తి తప్పు చేస్తే అందరినీ తప్పు పట్టడం అన్యాయం. తప్పుడు పనులు చేసిన వారు అన్ని వర్గాల్లో ఉన్నారు. అలాగని అందరినీ తప్పుడు మనుషులు అనలేం కదా. నాయకులు నిజం తెలుసుకుని మాట్లాడాలి. జనసేన నాయకులు చేసిన ఆరోపణలకు క్షమాపణ చెప్పాలి. నిజాయితీతో పనిచేసే వలంటీర్ల పట్ల అసత్య ఆరోపణలు చేయడం మంచిది కాదు.

– డి.శ్యామల, వైఎస్సార్ కాలనీ

వలంటీర్ వ్యవస్థ కొనసాగాలి



వలంటీర్లు లేకపోతే అర్హులకు పథకాలు అందవు. గతంలో ఇంటి స్థలం కోసం అధికారులు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ఫలితం లేదు. మా వలంటీర్ మా ఇంటికి వచ్చి దరఖాస్తు పూర్తి చేయించింది. ఇంటి స్థలం మంజూరు చేయించింది. ఒక్క పైసా కూడా అడగలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశించిన విధంగా వలంటీర్లు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం మంజూరు చేయించారు. నిజాయితీగా పనిచేసి వలంటీర్లు ప్రజల అందరి మన్ననలు అందుకున్నారు.

– జి.శిరీష, వైఎస్సార్ కాలనీ

వలంటీర్ల సేవలు మరువలేం



వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చే రూ 5 వేలు సరిపోవు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిపై నమ్మకంతో పని చేస్తున్నారు. ఈ రోజుల్లో పైసా తీసుకోకుండా సాయం చేసేవారెవరు. వలంటీర్లు నిజమైన సేవకులు. కరోనా సమయంలో సైతం ఇంటింటికీ తిరిగి జ్వరం ఉందా, లేదా అని పరీక్షలు చేయించారు. మందులు ఇప్పించారు. క్వారంటైన్ సమయంలో ఇంటికి వచ్చి కూరగాయలు, తాగు నీరు అందించారు. వలంటీర్ సేవలు ఎవ్వరూ మరువలేరు. అలాంటి వారిపై ఆరోపణలు చేయడం బాధనిపిస్తోంది.

– కె.వెంకటలక్ష్మి, వైఎస్సార్ కాలనీ

మా కుటుంబ సభ్యుడిలా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రతి కుటుంబానికి ఒక బంధువును ఇచ్చారు. వారే వలంటీర్. ఇప్పుడు మా కుటుంబ సభ్యుడు అయ్యాడు. ప్రభుత్వ పథకాలు గుర్చి మొట్టమొదట మాకు చెప్పేది మా వలంటీర్. ఇంటి స్థలం వచ్చింది, పింఛన్ ఇస్తోంది. ఇంతకన్నా ఏం కావాలి. అయినవాళ్లు కూడా ఇలాంటి సేవలు చేయరు కదా. మా కుటుంబంలో ఏ కార్యక్రమం జరిగినా తప్పకుండా వలంటీర్ను బంధువులా పిలుస్తాం. వలంటీర్ సేవలు తెలియని వాళ్లే తప్పుడు ఆరోపణలు చేస్తారు.

– ఎస్ సాజిదా, వైఎస్సార్ కాలనీ

సంక్షేమ పథకాలు అందుతున్నాయ్



మాకు ఏ సమస్య ఉన్నా మా వలంటీర్కు ఫోన్ చేస్తే వెంటనే వచ్చి సాయం చేస్తుంది. ప్రతి నెలా 1వ తేదీన పింఛన్ ఇస్తుంది. ఒక్కరోజు కూడా ఆలస్యం చేయదు. వలంటీర్ వల్ల మా కుటుంబం సంక్షేమ పథకాలు అందుకుంటోంది. వలంటీర్ లేకపోతే నాలాంటి పేదలు ఎందరో అధికారులు, నాయకులు చుట్టూ తిరిగాల్సి వచ్చేది. నాయకులు చెప్పినట్టు వినాలి. ఇప్పుడు జగన్ ప్రభుత్వంలో నాయకులు మాటలు వినడం లేదనే వలంటీర్లు మంచి వాళ్లు కాదని ఆరోపిస్తున్నారు. ఇది నిజం కాదు.

యడ్ల లక్ష్మి, వైఎస్సార్ కాలనీ

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి జఫరుల్లా

ఏలూరు (టూటౌన్) : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానానికి అనుగుణంగా రెగ్యులర్ చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి జఫరుల్లా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా సమావేశం టి.శ్రీలక్ష్మి అధ్యక్షతన స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయం వద్ద ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సయ్యద్ జఫరుల్లా మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు డీఎన్వీడీ ప్రసాద్, జిల్లా నాయకులు పాల్గొన్నారు. అనంతరం యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన డి.వేణుగోపాలచారిని అభినందించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : మహిమ గల తల్లి రాట్నాలమ్మకు భక్తులు విశేష పూజలు చేశారు. పెదవేగి మండలం రాట్నాల కుంటలో వేంచేసిన అమ్మవారి ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్లపై రూ.37,255, విరాళాలు రూ.3,863, ప్రసాదం విక్రయం ద్వారా రూ.31,200 మొత్తం రూ.72,318 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్కుమార్ తెలిపారు. ఈ దేవస్థానంలో శివాలయ నిర్మాణానికి హైదరాబాద్ వాస్తవ్యులు యలమంచిలి పండుబాబు, వాణిశ్రీ దంపతులు రూ.1,00,116 విరాళం అందజేశారు. అనంతరం ఏలూరు వాస్తవ్యులు ఆలపాటి రమేష్ మాధవి దంపతుల కుమార్తె చిరంజీవి సుష్మ రూ.లక్ష విరాళంగా అందించారు.

సీఎం జగన్కు కొప్పువెలమలు రుణపడి ఉంటారు



జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులను సత్కరిస్తున్న కొప్పు వెలమ సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి కొప్పువెలమలు ఎంతో రుణపడి ఉంటారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఏలూరు నగరంలో కొప్పువెలమ సంఘం ఆధ్వర్యంలో జెడ్పీ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో కొప్పు వెలమలకు తగిన గుర్తింపు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్కే దక్కుతుందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా, మంత్రిగా పదవులను కట్టబెట్టిన సీఎం తాజాగా గోదావరి జిల్లాల జెడ్పీ చైర్పర్సన్ పదవిని తొలిసారిగా అవకాశం కల్పించారన్నారు. కొప్పు వెలమలు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయడం ద్వారా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, మాజీ మంత్రి మరడాని రంగారావు, మూడెడ్ల రంగారావు, అల్లు ఉమామహేశ్వరరావు, ఆర్నేపల్లి మధు, బల్లా శివ, మరడాని అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమావేశం విజయవంతంపై హర్షం

దెందులూరు: జాతీయస్థాయి రేషన్ డీలర్ల మహాసదస్సు విజయవాడలో విజయవంతం కావడంపై రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి పోతునూరులో మండల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. రేషన్ డీలర్ల సంక్షేమం, అభివృద్ధి, భద్రత, భవిష్యత్తు దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రేషన్ డీలర్ల మహాసభలో రాష్ట్ర మంత్రి కారుమూరి డీలర్లపై వరాలు జల్లు కురిపించడం సంతోషంగా ఉందన్నారు. కమిషన్ పెంచడం, చనిపోయిన రేషన్ డీలర్లకు మట్టి ఖర్చు ఇస్తామని, మృతి చెందిన డీలర్ల కుటుంబ సభ్యులకు ఎక్స్గ్రేషియా అందజేస్తామని, సరుకుల్లో తరుగులు రాకుండా చర్యలు తీసుకుంటామని, ఎంఎల్ఎస్ పాయింట్ల వద్దే రేషన్ తీసుకునేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని, రేషన్ డీలర్లందరికీ ఎటువంటి సమస్యలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, మంత్రి కారుమూరి హామీ ఇవ్వడం రేషన్ డీలర్లందరికీ సంతోషంగా ఉందని అన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రేషన్ డీలర్ల రాష్ట్ర కమిటీ, ఏలూరు జిల్లా కమిటీ తరుపున జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విజయవాడలో నిర్వహించిన రేషన్ డీలర్ల మహాసభకు విచ్చేసిన డీలర్లందరికీ, యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే బోర్డు మెంబర్ తనిఖీతో స్పందించిన రైల్వే కాంట్రాక్టర్

దెందులూరు: దెందులూరు– అలుగులగూడెం వద్ద నిర్మిస్తున్న అండర్ పాస్ పక్కన అత్యవసర ప్రయాణ మార్గాన్ని తనిఖీ చేయడంతో ఆరు గ్రామాల ప్రజలకు తాత్కాలికంగా సమస్య తొలగింది. ఇటీవల కేంద్ర రైల్వేబోర్డు రైల్వే జోనల్ యూజర్ కన్సల్టెన్సీ కౌన్సిల్ బోర్డు మెంబర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ అండర్పాస్ నిర్మాణ వద్ద మార్గాన్ని తనిఖీ చేశారు. దెందులూరు– అలుగులగూడెం వెళ్లే మార్గం కాలినడకకు కూడా వీలు లేని విధంగా నీరు నిలిచిపోవడం, నడిస్తే బురదతో జారిపడిపోవడం, అసలు వెళ్లలేని విధంగా తయారైంది. ఈ నేపథ్యంలో స్పందించిన రైల్వే కాంట్రాక్టర్ ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా మోటారు పెట్టి బురద నీటిని బయటకు తోడుతున్నారు. ట్రాక్కు రెండు వైపులా నడవడానికి అసౌకర్యం లేకుండా నడిచివెళ్లేందుకు చర్యలు చేపట్టారు. రైల్వే ఉన్నతాధికారులు సైతం తరుచూ అండర్పాస్ నిర్మాణం, ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన మార్గానికి అసౌకర్యం లేకుండా తరుచూ తనిఖీలు చేయాలని ఆరు గ్రామాల ప్రజలు రైల్వే ఉన్నతాధికారులను కోరుతున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	96	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07–10
బెండకాయలు	34	కంద	44
పచ్చిమిర్చి	70–80	బీట్రూట్	40
కాకర కాయలు	36–44	కీరా దోస	28
బీరకాయలు	40	ఫ్రెంచ్బీన్స్	--
బీరకాయలు (పందిరి)	50	అల్లం	188–270
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	16	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	24–30	బఠాణి	--
అనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	100
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	38
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	26
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	33
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	32

మణిపూర్ అల్లర్లపై నిరసన



విద్యానగర్లో నిరసన తెలియజేస్తున్న మహిళలు



పాతబస్టాండ్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్) : మణిపూర్లో క్రైస్తవులపై జరుగుతున్న అమానుష చర్యలు, దాడులు, హత్యలు, అత్యాచారాలను ఖండిస్తూ స్థానిక విద్యానగర్ నందు హోలీ ట్రినిటీ లూథరన్ చర్చి ఫాదర్ కె.కరుణబాబు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరుణబాబు మాట్లాడుతూ మణిపూర్లో స్త్రీలను అవమానించి, చర్చిలను ధ్వంసం చేస్తూ అకృత్య కార్యాకలాపాలకు పాల్పడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. అల్లర్లలో తగులబెట్టిన 300 చర్చిలను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అరాచకాలను ఆపకపోతే క్రైస్తవులు దేశ వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యకళ కరుణబాబు, పాస్టర్ బి.అజయ్ కళ్యాణ్, సంఘ డెలిగేట్ బురద గుంట క్రాంతి రవికిరణ్, కోశాధికారి పి.రవికుమార్, పీసీసీ సభ్యులు వై.సువర్ణ పాల్, జి.స్వర్ణకుమారి, టి.శాంత భూషణం, బి.ప్రవీణ్ రాయ్, ఉపాధ్యాయులు, స్థానిక యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మణిపూర్లో మతోన్మాదుల అరాచకాలను అరికట్టాలి

ఏలూరు (టూటౌన్) : మణిపూర్లో మతోన్మాదుల అరాచకాలను అరికట్టలేని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణం రాజీనామా చేయాలని, ఈ అరాచకాలకు కారకులైన మతోన్మాద దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శి ఏ.రవి మాట్లాడుతూ సభ్య సమాజంలో అందరూ తలదించుకునేలా అత్యంత పాశవికంగా దాడులు, హత్యలు, అత్యాచారాలు పాల్పడుతుంటే బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తుందంటూ ప్రశ్నించారు. మణిపూర్ ముఖ్యమంత్రికి ఏ మాత్రం నైతిక విలువలు ఉన్నా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, ఏ శ్యామలరాణి, నాయకులు పి.ఆదిశేషు, కొర్రి విజయలక్ష్మి, బి.జగన్నాధరావు, కంది విశ్వనాధం, కె.రామాంజనేయులు, కట్టా సత్యనారాయణ, జి.రవికిషోర్, వైఎస్ కనకారావు, పి.రవికుమార్, ఎస్.సత్యనారాయణ, ఎం.ఇస్సాక్, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్వీడీ ప్రసాద్

ఏలూరు (టూటౌన్) : వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్వీడీ ప్రసాద్ కోరారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయం వద్ద వెలుగు వీవోఏల జిల్లా సమావేశం లక్ష్మీ రాధా అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. వీవోఏల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ నిర్మలాదేవి, జిల్లా కార్యదర్శి ఎస్కే సుభాషిణి మాట్లాడుతూ వీవోఏలకు మహిళా మార్టులు పెనుభారంగా మారాయన్నారు. కోళ్లు, గొర్రెలు, మేకలు, గేదెలు ఇచ్చి అభివృద్ధి చేయాలని చిన్న సంఘాలపై ఒత్తిడి తెచ్చే విధంగా పనిచేయిస్తున్నారన్నారు. తాము ఆన్లైన్లో పనులను సొంత ఫోన్లలో చేస్తున్నామని అవి కూడా ఇప్పుడు హ్యాంగ్ అయిపోతున్నాయని కాబట్టి వీవోఏలకు ఫోన్లు ఇప్పించాలని కోరారు. పనిభారం తగ్గించాలని, తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏల సంఘం జిల్లా నాయకులు లక్ష్మి, సునీత, వి.నాగలక్ష్మి, జె.మేరీ, ఈ.జయ, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

500 మందికి నియామక పత్రాల అందజేత

దెందులూరు: వేగవరంలోని హేలాపురి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాలలో వైస్ ప్రెసిడెంట్, డాక్టర్ అరసవల్లి అరవింద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 500 మందికి నియామక పత్రాలను సీఈఓ ఆర్. సౌజన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ డీ. మోహన్రెడ్డి అందజేశారు. ఆదివారం కళాశాలలో అరసవల్లి అరవింద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 60 మల్టీ నేషనల్ దిగ్గజ కంపెనీలు 3 వేలకు పైగా ఉద్యోగాలకు మెగా జాబ్మేళా నిర్వహించారు. అర్హులైన వారిని 500 మందిని ఎంపిక చేసి వారికి నియామక పత్రాలు అందజేశారు. మెగా జాబ్మేళా నిర్వహించి వందలాది మందికి బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించిన కళాశాల వైస్ ప్రెసిడెంట్ అరవింద్కు కళాశాల ఏఓ కరుణానిధి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులను తల్లిదండ్రుల్లా ఆదరించాలి



సమీకృత బాలికల వసతి గృహంలో భోజనాన్ని రుచిచూస్తున్న జేడీ జయప్రకాష్

చింతలపూడి : చింతలపూడి సమీకృత బాలికల వసతి గృహాన్ని, అంబేద్కర్ గురుకుల పాఠశాలలను సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాష్ ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. పిల్లలకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వసతి గృహ సిబ్బందిని, కాంట్రాక్టర్ను హెచ్చరించారు. నాణ్యమైన భోజనం పెడుతున్నారా, నాణ్యమైన విద్యను బోధిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులపై సత్ప్రవర్తన కలిగి ఉండాలని, పిల్లలను తల్లిదండ్రుల్లా ఆదరించాలని సూచించారు. ఎలాంటి ఆరోపణలు రాకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. ఆయన వెంట సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఉన్నారు.